11 ఏప్రిల్ '97
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక




# ఏమిటిది?

ఎఱ్ఱముద్ద వేలను చీల్చుకుని - పైపైకి ఎగ బాకుతున్నది.మసగ వెలుగుతో బాటు జనావాసపు అలికిడి మొదలయింది. పక్షులు గూళ్లను విడుస్తూండగా - వెలుగునీడల దోబూచులాట కనిపించుతూంది. ఇళ్లముందు - కళాపి చల్లి-ముగ్గు లేస్తున్నారు ఆడంగులు. పాల సైకిళ్లు-గుమ్మంలోకి రాకముందే లేగల్ని వదిలి- పాలు పితుకుతున్నారు. నీరెండ - కొంచెం కొంచెం ఎఱుపుకు పులుముకుంటూంది.

పల్లెనుంచి రాంపండు-సైకిలుపైన బయలుదే రాడు. అతని మొఖాన హడావుడి కనిపిస్తున్నది. సైకిలు వేగాన్ని పెంచాడు. విమానంలో టౌనులో వాలిపోవాలని ఉంది రాంపండుకు. రెక్కలుంటే గద్దలా వెళ్లొచ్చు. దీనికీ ఇంధనము అక్కరలేదు అనిపించింది. తనను దాటి వెళ్తున్న లారీలు, స్కూటర్లు కళ్లబడ్డ తరువాత తను సైకిలెక్కి ప్రయాణం చేస్తున్నట్టుగా గుర్తుకొచ్చింది. బాగా అలసటగానూ తోచింది. ఆగి ఒక బీడి కాల్చివెళ్తే? అనుకుంటూనే సైకిలు ఆపి కిందికి దిగాడు. బీడి వెలిగించబోతూండగా అరె!ఆలస్యమయితే ఎమ్మెల్యే ఎటైనాపోతాడు. ఆయన లేకపోతే ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు రాత్రి తీసుకపోయిన వాడి ఎముకలు-సున్నంలోకి కూడా మిగలవు. అనిపించి గబుక్కున సైకిలెక్కాడు. త్వరగా వెళాలనే ధ్యాసలో పెడల్ని వేగంగా తొక్కాడు. కొద్ది దూరమైనా చేరకముందే వేగం అంతగా పెరగకపోగా, రొప్పు, దగ్గూ మొద లయ్యాయి. ఈ దగ్గుకూ, సైకిలు తొక్కడానికీ అంత పొంతన కుదరదు గనుక వేగం తగ్గిం చాడు. అది నడక స్థాయికొచ్చింది. అయినా ఊపిరి చేదుకుని తొక్కుతూనే వున్నాడు. ఏటి ఒడ్డు దాపుకు చేరాడు. ఎగుడు ప్రారంభమైంది. సైకిలు మొరాయించింది. దిగి సైకిల్ను తోసు కుంటూ నడిచాడు. బ్రిడ్జి ఎక్కాక ఉత్సాహంగా సైకిలెక్కాడు.

ఖమ్మం టౌను కనిపిస్తుంది.

బ్రిడ్జి దాటి దిగితే ఖమ్మమేగదా! అనుకుని సైకిల్ని విసురుగా తొక్కాడు. కొంచెం దూరం నడచిందో లేదో ఠప్ మంది సైకిలు చైను. ఛ. ఇది ఇప్పడే పడిపోవాలా! అనుకుని ఆపి, సైడుకు తీసి స్టాండు వేశాడు. క్రిందకు వంగి చైనును బలిమిన ఎక్కించి పెడలును ఒక్కసారి వెనక్కి తిప్పి చూసుకొని సైకిలెక్కాడు. చేతికి అంటిన ఆయిల్ జిడ్డును కూడా పట్టించుకోలేదు. కూర గాయల సెంటరు దాటుతూండగా ఓ ఆటో వేగంగా వస్తున్న సైకిలుకు తగిలింది. సైకిలతను ఎగిరి కింద పడ్డాడు. జనం అతగాని చుట్టూరా అర క్షణంలో ఈగల్లా ముసిరారు. దాన్ని పట్టిం చుకోలేదు రాంపండు. రెండో వంతెన ఎక్కాడు. అది దిగితే ఇంకేముంది. సైకిలు తొక్కాల్సిన పనేలేదు. బ్రేకు చేత ఉంచుకుంటే చాలు. జయ్యిన అదే పోతుంది. కానీ ఇవగు ఒళ్లంతా చమటతో తడిసింది. ఒకటి రెండుసార్లు చెమట పెదాలకు అంటి ఉప్పగా అనిపించింది. నాలుగు లారీలు వరుసగా ఎదురొచ్చాయి. బాగా సైడుకు దిగాల్సి వచ్చింది.

రోడ్డు 'వార'న దుబ్బ ఉండడాన సైకిలు అటూ ఇటూ కదిలింది॥ హ్యాండిలు బలంగా పట్టుకొని-నెమ్మదిగా తోక్కాడు.

వెనుకనుంచి కారొచ్చింది. ఇంకా సైడుకొచ్చాడు. సైకిలు దిగాడు-

అటువారు, ఇటువారు పోయాక- లేచిన దువ్వ తగ్గాక-నడక ప్రారంభించాడు. ఎంత తొందరగా చేరుకోవాలనుకుంటే- అంతగా ఆలస్యమైంది. చ- అనుకొని మయూరి సెంటరునుంచి మళ్ళీ సైకి లెక్కాడు. పార్టీ ఆఫీసుకు చేరేసరికి మరో పది నిముషాలు పట్టింది. సైకిలును ఆఫీసు ముందర పడేసి-లోనకు నడిచాడు. జనం రద్దీగానే ఉన్నా- అంత హడావుడిగా లేదు. గబ గబ- ఆఫీసు ఇన్‌ఛార్జ్- 'సత్యం' దగ్గరికి నడిచాడు.

'ఎం.ఎల్.ఏ గారున్నారా' అని అడిగాడు.

ఎటో మాటాడుతున్న సత్యం- ఒక్కసారి రాంపండును ఎగాదిగా చూసి 'వీడు మన జాతీ యుడే' అనే దాన్ని నిర్ధారించుకొని 'ఆ! ఉన్నాడు' అన్నాడు.

'ఎక్కడ?'

'పైన'

తల ఊపి గబగబ-మెట్లెక్కిండు రాంపండు.

గది ముందర ఉన్న కుర్రాడొకడు-రాంపండు లోపల-జొరబడకుండా ఆపి- ఎవరు నువ్వు-ఎవర్ని కలవాలి? అని అడిగాడు.

'మన ఎం.ఎల్.ఏ గార్ని కలవాలి'.

**చావా శివకోటి**

'ఏ ఊరేటి'

'నాదా పాలెం'

కర్రా అప్పడి పాలెమా– ఎర్రఅప్పడి పాలెమా?

'ఎర్ర అప్పడే'

'ఏమన్న కొట్లాట జరగలేదు గద!'

'అదేం లేదు'

'మరి ఏం పని?'

'పని ఉంది'

ఉంటే ఆయనే రావచ్చు గదా!

'ఊళ్ళో లేదు. పోతుకున్నకోసం గూడెం పోయుండు' అని. నేను కొంచెం మాటాడాలి. మన 'పోరళ్ళ' లీడరు లేదూ– రంగడు. వాణ్ణి రాత్రి ఎక్సైజ్ పోలీసులు పట్టుకపోయారు.

'ఎందుకు'

ఎక్సయిజోళ్ళు ఎందుకు పట్టుకుపోతరు?– అని నవ్వి– నేనొకసారి మన ఎం.ఎల్.ఏ తో మాటాడాలి? అన్నాడు ఆరాటంగా.

చూద్దాం– అన్నాడు ఆగి పోరడు.

అసలాయన్ను నాకు కలువుతావా? వాళ్ళందరూ వచ్చిందాకా ఇక్కడే ఉంచుతావా!' అని పై కండువాతో ఒళ్ళంతా తుడుచుకొని– 'ఏడెవ డండి బాబూ! ఇట్లా పొగడిండు!' అని చీదరగా చూసాడు.

ఇంతలో ఒకడు హడావుడిగా లోపనుంచి– బైటకొచ్చి. గబగబా క్రిందికి దిగుతూ– 'ఇప్పడేడ అవుతది' అనుకుంటూ వెళ్ళిపోయాడు. ఎవడో వెనకపడి తరిమినట్టుంది వాని నడక.

లోపల ఉన్నాడనేది– పక్కాగా తెలిసింది గనుక, అక్కడే నిలబడ్డాడు.

నాల్గయిదు నిముషాల తరువాత– ఓ ఆడ మనిషి బయటకొచ్చింది. చాలా నింపాదిగా! వయస్సుడిగినావిడ కాదు. అట్టని కొత్త పిల్ల కాదు. నడికారుకు దగ్గరగా ఉంది. సుఖంగా పెరిగినట్టుంది– రంగూ, మెరపూ కనపడుతున్నది. నోట్లో కారాకిళ్ళీ– పెదాల్ని పండించి– మాంచి సువాసననిస్తున్నది.

ఆవిడను చూసిండు రాంపండు. ఎం.ఎల్.ఏ సంగతేమైనా చెప్తదేమోనని ఆశపడ్డాడు. గడప దగ్గరున్నోడ్ని అడిగిండు. ఈవిడ చిన్నబ్బాయిగారి భావతా? లేక బంగ్లా దగ్గర ఇలాఖావా! అని చెవి దగ్గర.

ఛ! ఊర్కో– ఆవిడ నెవక ఎవరైతే మనకెందుకు? ప్రస్తుతం ఈవిడ మన జిల్లా మహిళా విభాగానికి అధ్యక్షురాలు. కొద్ది దినాలనుంచి– ఆడంగుల్ను– బాక పైకి లేపాల్నని– మాలావు ఇదయిపోతన్నది. ఒళ్ళు దాచుకునే రకంగాదు. నల్లమాలిన సేవ–జేస్తున్నదని అంటున్నారు–' అన్నాడు.

'ఆడాళ్ళను ఈవిడ బాగు చేసేదేంది! గోంగూర నాంళ్ళను బాగు చేయడానికి. అసలావిడకు తీరికగా దొరికేదెప్పుడు? మగోళ్ళకు పని దొరికినా దొరక్కపోయినా నాంళ్లకు నమ్మకంగా దొరుకుతూనే వుంది గదా' అని అరక్షణం ఆగి. 'అయిన మనకెందుకు– ఇంకా ఏం జేస్తదో చూస్తేపోయే' అనుకున్నాడు.

**అందరికీ 'స్వీట్స్'**

పెద్ద గొడవలు, గందరగోళాలు అయిపోయాక కువిక అనేక యువనటి బాలీవుడ్ సింగర్ కుమార్‌సానుని ఫ్రీగా వదిలెయ్యాలని నిర్ణయించుకుందట. ఆ దెబ్బతో కుమార్‌సాను భార్య రీటా సాను, వాళ్ళ వీధిలో ఉండేవాళ్ళ కందరకూ స్వీట్స్ పంచిపెట్టిందట!

'ఈయమ్మ ఉపన్యాసం ఎప్పడన్నా విన్నావా? అడిగిండు. రాంపండును.

తల అడ్డంగా ఊపిండు.

'బల్ల పగిలిపోతది–చెవుల తుప్ప దులిపేస్తది. ఎంత 'ఘాట'నీ– ఎంత టోళ్ళయినా– ఇదయిపోవాల్సిందే.

'అదినరే గానీ ఎం.ఎల్.ఎ ను గలవాలనయ్యా! ఈయన ఫోనుజేసేటోళ్ళకు టేషనుల నాంళ్ళు లేక పోయినా కష్టమౌతది'.

'మద్య నిషేధం ర్యాలీ' నదో తేదీన ఉంది. జిల్లాలో ఉన్న మహిళలంతా. ముఖ్యంగా మన పార్టీ నాంళ్ళు. తప్పక రావాలి. అలా వచ్చేందుకు ప్రోత్సహించాలి. దాని విజయంపైన మన పార్టీ బలం నిరూపితమవుతది' అని అధ్యక్షురాలు– అప్పడే వచ్చిన ఆడాళ్ళతో చెపుతుంది.

'మన ఎం.ఎల్.ఏ గారేం మీటింగున ఉన్నారేంది?'

'సారా నిషేధం. మామూలుగా ఎట్టా అమలు జరపాల' అన్న దానిపైన– మన పార్టీ తరపున– కొన్ని సూచనలు చేయాలట. వాటిని తయారు చేస్తున్నారు. ముఖ్యమంత్రి దగ్గరకు పోయే పని గదా!'

'గదేందయ్యా! అట్లంటవు. ఇది వరకు 'అమ్మేటోడు–కొనెటోడు' ఉంటిరి ఇప్పడట్ల లేదుగద! ఎవరికి వాడే తయారు చేస్కుంటున్నాడు. పోలీసులకు ఎక్సయిజోంళ్ళకు 'కాంట్రాక్టర్లు' సారా యాపారం అప్పడు 'మామూళ్ళు' (నెల వారీ) ఇచ్చినట్టు నాంళ్ళు ఇస్తన్నారు గద! ఊళ్ళే సారా దొరుకుతంది. దీన్ని అదుపు జేసే టోళ్ళకు– మామూళ్ళు దొరుకుతుండె. ఇంగ ఇది ఆగేదెట్ట? అది అట్ట పోనియి. మొన్న ఎన్నికలలోనే గద! అన్ని పార్టీలోళ్ళూ– సారాయి పంచింది, అప్పడు ఈ నిషేధ అమల్లోనే ఉంది గదా! ఇంతలో నాంళ్లకు ఏమయిందంటవు. అన్నాడు దిగులుగా. రాంపండు కిదంతా పిచ్చి పిచ్చిగా అనిపించింది.

'ఎం.ఎల్.ఏ బైటకొస్తే బాగు' అనుకొని అటు జూచిండు.

ఇంతలో ఓ మల్లు పంచె పెద్ద మనిషి – క్రిందికి దిగిండు. వాని దగ్గర సారా వాసన గుప్పన కొట్టింది. కాకుంటే కారా కిళ్ళీ వాసనతో కలిపి.

'ఇగో! నేను లోపలికి పోతనయ్యా! మానోడికేమైతదో ఏమో?!_ అన్నాడు రాంపండు.

అయ్యేదేముంది! నన్ను పిచ్చి బూతులు కూసడు– మీ ఎదుట గాదు. మాపిటికి– అని అదోలా నవ్వింది–

'సారు' వస్తున్నాడు' అంటూ ఒకడు పొట్టిగా. పొర్లుతూ వచ్చిండు.

ఆనక– నిజంగానే ఎం.ఎల్.ఏ ఎవరితోనో మాటాడుతూ బయటకు వచ్చిండు

ఆయన వెనకా అయిదారుగురున్నారు.

గడప ముందుకు రాగానే–దండం పెట్టిండు రాంపండు. మొఖం ఇంత చేసుకొని. ఎం.ఎల్.ఏ రాంపండును చూసిండు. పల్కారింపుగ.

గడప దగ్గరున్నోడు. ఎం.ఎల్.ఏ చెవికాడకుపోయి 'సార్' వీడు పక్కాగా మనోడు. ఎర్ర అప్పయ్య పాలెం– ఎక్సయిజ్ పోలీసులు మనోడ్ని– రాత్రి తీసుకపోయినారట. కూస్త ఫోను గొడితే– అని చెప్పగనే. చేతమన్న ఫోను– ఇచ్చి.

'నెంబరు కలువు' అన్నాడు.

ఫోను కలిపి ఇచ్చాడు– గడపదగ్గరోడు.

రెండు నిముషాలు మాటాడి. 'ఇకపో! నువ్వు పోయే వరకే వదుల్తరు' అని నవ్విండు. కొంచెం రాంపండు దగ్గరికొచ్చి. మన గోపయ్యను ఒకసారి వచ్చి కలవమను. ఏం. ఇంకేం పనిలేదుగ! అనుకుంటూ నడిచిండు. గడప దగ్గరోనికి– రాంపండు దండం పెట్టి– వెనక్కిం మళ్ళిండు' ఊళ్ళో కొద్దిగ పని ఉంటే చూసుకొని– సైకిలెక్కిండు.

పని అయింది గనుక నిశ్చింతగుంది.

వంతెన దాటిండు.

ఏటిమీదకు రాగానే. ఎవడో రోడ్డుకు అడ్డంగా పడి కనిపించిండు త్రాగి–

గబ గబ సైకిలు దిగి వాణ్ణి వారకు గుంజిండు. 'ఇంత సేటు ఎందుకు తాగాలి! మప్పితంగ తాగి. కొంపకి చేరితే బావుంటది గదా!' అనుకొని సైకిలెక్కిండు. సైకిలు నడుస్తున్నది. ఎక్సయిజు పోలీసు జీపు ఎదురయింది– దాన్లోనూ కావుసారా అమ్మే నాంళ్ళున్నారు. పట్టుకపోయి కేసులు రాస్తరు. తంతరు. అంతకుమించి ఏం చేస్తరు. ఇప్పడు మన పార్టీ నోడ్ని వదిలించింది– ఈ కేసులోనే గద. చట్టం చేసింది ఈ ఎం.ఎల్.ఏ లే గద! అసలు న్యాయంగ మన పార్టీ నాంళ్ళు దాన్ని కాయగూడదు గద! మరి అంత నడుస్తనే ఉందెందుకు? నడిచేటప్పడు నిషేధమెందుకు! గవర్నమెంటుకు వచ్చే డబ్బును దళారుల తినడమెందుకు?' అనిపించి– అర్థంగాలేదు రాంపండుకు ఇదేదో– చానా లిరకాసుగ ఉండది. మనకు అందదులే' అనుకొని సైకిలు ఉసిగతొక్కిండు.

ఎర్రముద్ద– భూమిలోకి దిగిపోతున్నది. గోధూళి నిండి ఉంది తోవ. చీకటి–వెలుగును మింగి– లోకాన్ని చుట్టేస్తున్నది. చుక్కలు మాగన్నుగ మిణుకు మిణుకు మంటున్నాయి. రాంపండుకు తోవ మసక బారికనపడింది. తోవపైనుంచి ఊరేపు చూసాడు. ఊరు దాపున కనపడ్డది. 'దీపాలు పెట్టకముందే– ఊళ్ళేకి పోవాల' అనుకున్నాడు. ఇంటికాడ సైకిలు దిగేసరికి దీపాలు వెలిగి కనపడుతున్నాయి. అన్ని దీపాలున్నా దేని నీడ దాన్నంటుకొనే ఉంది.